## అమరచింత ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

**వనపర్తి జిల్లా ఆర్టీసీ డీఎమ్ పరమేశ్వరి..**



**అమరచింత,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** అమరచింత ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామని వనపర్తి జిల్లా ఆర్టీసీ డీఎమ్ పరమేశ్వరి అన్నారు. శుక్రవారం అమరచింత ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను ఆమె పరిశీలించారు. అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మంగమ్మ నాగభూషణం గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జీ.ఎస్.గోపి, కమీషనర్ మహ్మద్ ఖాన్, ఆర్టీసీ డీఎమ్ కు అమరచింత పట్టణానికి వనపర్తి డిపో బస్సులు వేయాలని డీఎమ్‌ను కోరారు. ఆర్టీసీ డీఎమ్ సానుకూలంగా స్పందించారు. అమరచింత బస్టాండ్ ముందర భాగంలో డబ్బాలను తొలగించాలని ఆర్టీసీ డీఎమ్‌ను కోరారు. చిరు వ్యాపారస్థుల ఆర్టీసీ స్థలంలో వెనక భాగంలో ఉన్నవారు అద్దె చెల్లించాలని ఆమె కోరారు. ఆర్టీసీ అధికారులు చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, జీ.ఎ.గౌడ్ ఉన్నారు.

## 80% పనులు జరిగాక ఆపాలని ఫిర్యాదు తగదు..

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్..**



**అమరచింత,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** అమరచింత పట్టణంలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న దుకాణం పనులను ఆపేయాలని బారాస నాయకులు మున్సిపల్ కమీషనర్ కు ఫిర్యాదు చేయడం తగదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. కుతుబ్ అన్నారు. శుక్రవారం అమరచింతలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ముస్లిం కమ్యూనిటీ హాల్ కోసం 2018లో రూ.5లక్షలు మంజూరు చేశారని ఆ నిధులతో దుకాణ సముదాయం నిర్మించాలని మజీద్ కమిటీ తీర్మానం చేసిందని, పనులను ప్రారంభించి 80% పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఇటీవల బారాసా కు చెందిన కొందరు ముస్లిం, మైనార్టీ నాయకులు పనులు ఆపాలని కమీషనర్ కు ఫిర్యాదు చేశారని అభివృద్ధి జరగాలని చెబుతున్న వారే పనులకు ఆటంక పరచడం సరికాదని ఫిర్యాదును ఉపసంహరించుకోని సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు సమీర్,యూనిస్,రహమత్,ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ



**మల్దకల్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** మల్దకల్ మండలం, పెద్దొడ్డి, ఉలిగేపల్లి, మల్లెదొడ్డి గ్రామాలలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు పంపణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 8642 గొర్రెలు, 550 మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగింది. మల్లెందొడ్డి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో భాగంగా 12 గేదెలలో, 14 ఆవులలో పరీక్ష చేసి గర్భశయానికి సంబంధించిన వ్యాధులకు చికిత్స అందించడం జరిగింది. కార్యక్రమం గురించి పశువైద్యాధికారి డా. ఎన్ యామిని సాయి ఆవులు, గేదెలు సరైన సమయంలో ఎదకి రాకపోవటం, పదే పదే ఎదకు రావటం, గర్భకోశ వ్యాధుల వలన పాల దిగుబడి తగ్గిపోతుంది. అందువలన ఈ శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కె. వెంకటేశ్వర్లు వీఎల్ఓ, రాఘవేందర్ జెవిఓ, రాజేంద్ర విఎ, అర్జున్‌సింగ్ విఎ, రామాంజనేయులు ఓఎస్, మధు ఓఎస్‌లు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తి..



**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ప్రారంభించి శుక్రవారానికి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కిసాన్ మోర్చ జాతీయ అధ్యక్షులు రాజ్కుమార్ చౌహార, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలోని చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు సన్మానం చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో వెల్టూరు, లక్ష్మీపల్లి గ్రామ రైతులు, ఇతర వనపర్తి జిల్లా రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతులకు సంవత్సరానికి పీఎం సమ్మాన్ నిధి ద్వారా రూ.6వేలు ఇస్తున్నారని, ఇతర వ్యవసాయ పథకాలైనటువంటి కృషి వికాస్ యోజన, కిసాన్ సాయిల్ టెస్టింగ్ కార్డ్స్, పీఎం కిసాన్, క్రెడిట్ కార్డ్స్, ఎరువుల సబ్సిడీ, ఫసల్ భీమా యోజన పథకాల గురించి మార్కెట్ యార్డ్‌లోని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ కార్యదర్శి జ్ఞానేశ్వర్ యాదవ్, కిసాన్ మోర్చ నాయకులు బాలయ్య, పెబ్బేరు మండల ఎస్సీ మోర్చ అధ్యక్షులు రాములు, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి





**కల్వకుర్తి,ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు మండలం జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవులుగౌడ్‌కు మంజూరైన రూ.48వేలు, పెద్ద యాదయ్యకు మంజూరైన రూ.1,16 లక్షలు, పోలేపల్లి గ్రామానికి చెందిన శ్రీనుకు మంజూరైన రూ.32వేలు, కడ్తాల్ మండలం గానుగుమర్ల తాండకు చెందిన పంత్యా నాయక్‌కు మంజూరైన రూ.26వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్సీ మాట్లాడుతూ సీఎం సహాయనిధి అంటే ఇంత కు ముందు ఎవ్వరికి తెలియదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సీఎం సహాయనిధి ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. అదే విధంగా తలకొండపల్లి మండలానికి చెందిన న్యాయవాది సుభాష్‌చంద్రబోస్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వీధి కుక్కలను గుర్తించండి...

**మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్**



**కల్వకుర్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ ప్రజలకు కుక్కల బెడద నివారించుటకు తగు చర్యలు తీసుకొనుటకు పశువైద్యశాల సిబ్బందికి, మహిళా సంఘాల ఆర్‌పీలకు మరియు శానిటేషన్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న వీధి కుక్కలను గుర్తించి వాటి నివేధికను త్వరగా ఇవ్వాలని సూచించారు. వాటికి పట్టి స్టర్లయిజ్ చేయించడం జరుగుతుందన్నారు. అలాగే విద్యార్థులకు, పట్టణ ప్రజలకు కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రజలు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని, వీధి కుక్కలు తిరుగుతున్న ఏరియాలో అసలే వేయకూడదని సూచించారు. అలాగే ఫంక్షన్ హాల్‌లో మరియు హోటల్‌లో వారు వ్యర్థాలను బయట ప్రదేశాల్లో వేయకుండా వాటిని జమ చేసి మున్సిపాలిటి శానిటరి సిబ్బందికి తెలియజేస్తే వారు తీసుకెళ్తానన్నారు. కుక్కలు ఎక్కులగా ఉన్న ప్రదేశాలను గుర్తించి శానిటరి సిబ్బంది నెం.9618453625కి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆయా శాఖల అధికారులు, పశువైద్య శాల ఏడీ జగదీశ్వరి, ఆర్.శివ, మహిళా సంఘాల ఆర్‌పీలు, పారిశుధ్య జవాన్లు తదితరులు ఉన్నారు.

# దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

**దేవరకద్ర, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదతర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన..**

దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. మహామంగళహారతి,ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ కల్వ కన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి,జిల్లా యువజన సంఘం కార్యదర్శి దోమహరికాంత్‌లతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**- అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**



దేవరకద్రలో వాసవిమాతకు పూజలు చేస్తున్న భక్తులు



అలంకరణలో వాసవిమాత అమ్మవారు

# ప్రభుత్వ కంటి వెలుగుతో పేద ప్రజలకు మేలు: రామ్‌దేవ్‌రెడ్డి

**ఇటిక్యాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం వల్ల పేద ప్రజలకు మేలు జరుగుతుందని గ్రామాలలోనే వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నారని ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామ్ దేవ్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని గోపల్ దిన్నె గ్రామంలో మండల పరిధిలోని గోపల్‌దిన్నె గ్రామంలో ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అదేవిధంగా వైద్య బృందం ఆధ్వర్యంలో గ్రామంలో ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాధాకృష్ణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి అన్ని వసతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రాందేవ్‌రెడ్డి, సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అంధత్వం లేని రాష్ట్రంగా తయారు చేసేందుకు గ్రామాలలోని పేద ప్రజలు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అక్కడే దగ్గర చూపుతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరుగుతుందని అలాగే దూరపు చూపు కంటి అద్దాలు అవసరమైన వారికి ఆన్‌లైన్‌లో నమోదు చేసి 20 రోజుల్లో వారికి అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ నాలుగు రోజులపాటు జరిగే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని 18 ఏళ్ల పైబడిన వారంతా తమ ఆధార్ కార్డును వెంట తీసుకొచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని వారు గ్రామ ప్రజలను కోరారు. కార్యక్రమంలో డా. జ్ఞాని వెంకటరామరాజు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఆప్తాలమిస్ట్ టెక్నిషియన్ మహేష్, డాటా ఎంట్రీ ఆపరేటర్ యువరాజు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పలత, ఏఎన్ఎంలు మహేశ్వరి, దుర్గాదేవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గోపల్‌దిన్నె గ్రామంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ రాధాకృష్ణరెడ్డి

# అవినీతి పాలన బీజేపీకే సాధ్యం..

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సోళీపూర్ గ్రామంలో ప్రజా గోస-బీజేపీ భరోసా సమావేశం శక్తి కేంద్రం ఇంచార్జ్, ఉపసర్పంచ్ రామి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో 19 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది ఏ రాష్ట్రంలో కూడా అవినీతి లేకుండా పాలన సాగిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అవినీతి ప్రభుత్వం ఉందని తెలిపారు. కరెంటు బిల్లులు పెంచి, బెల్టు షాపులు పెట్టి ప్రజలను దోచుకుంటున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులు అందిస్తుందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులను మోసం చేస్తుందని అన్నారు. గ్రామ పంచాయితీలకు కేంద్రం పంపిన నిధులను కేసీఆర్ ప్రభుత్వం దారి మళ్లిస్తూ దోచుకుంటుందని తెలిపారు. పేద ప్రజలకు ఉపాధి హామీ పనులకు కేంద్రం పంపిన నిధులను సక్రమంగా అందించడం లేదని అన్నారు. పెట్రోల్, డీజీల్ మీద టాక్సీలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో రామరాజ్యం రావా లని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నరేంద్ర మోదీ ప్రపంచం మెచ్చిన నాయకులు అని కొనియాడారు. రాబోయే రోజుల్లో ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నవీన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, మండల ఇంచార్జీ శ్రీశైలం, పార్లమెంట్ విస్తరక్ బుడ్డన్న, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, మండల ఉపాధ్యక్షులు రాంచందర్, బూత్ అధ్యక్షులు గణేష్ నాయక్, అంజి నాయక్, మహేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణ

# నిజ జీవితంలో సైన్స్‌ది విడదీయరాని బంధం

**- ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హాఖ్ - కౌకుంట్లలో ఘనంగా సైన్స్‌సంబరాలు**

**దేవరకద్ర,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నిజ జీవితంలో సైన్స్‌ది విడదీయరాని బంధమని కౌకుంట్ల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హాఖ్ అన్నారు. దేవరకద్ర మండలం కౌకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డీఈఓ ఆదేశానుసారం పిల్లలమర్రి సైన్స్ ఫోరమ్ అధ్వర్యంలో మండల స్థాయి సంబరాలను నిర్వమించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హాఖ్ ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకొన్న లక్ష్యాన్ని సునాయసంగా చేరుకోగల్గుతారన్నారు.అలాగే సైన్స్ ఉపాధ్యాయులు కే.సుమన్ మహరాజ్,అనిల్‌కుమార్,సునిత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వివిధ పోటీలలో పాల్గొనడ ం సంతోషకరమన్నారు. విద్యార్థులు గెలుపుఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా సంబరాల లో భాగంగా మూఢనమ్మకాల నిర్మూలనలో సైన్స్ పాత్ర,సైన్స్ అభివృద్ధి వరమా..శాపమా అనే అంశాలను వివరించారు. అలాగే సైన్స్‌కు సంబంధించిన గంగోలి,క్విజ్‌పోటీలను నిర్వహించారు.వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ బహుమతులను స్థానిక ప్రముఖ సామాజికవేత్త షేక్ అబ్దుల్ జహంగీర్ సమకూర్చారు. దీంతో ఆయా పాఠశాలల తరపున ఆయనను నిర్వహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కౌకుంట్లతో పాటు అప్పంపల్లి,ముచ్చింతల,పేరూర్ ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు శ్రీనివాస్,పి.శ్రీనివాస్,రమేశ్‌బాబు పాల్గొన్నారు. ఆయా పాఠశాలతో చెందిన విద్యార్థులు కూడ పాల్గొన్నారు.



కౌకుంట్లలో ప్రసంగిస్తున్న ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హాఖ్

# కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై మోపుతున్న భారాలను తగ్గించాలి..

**సీపీఎం పార్టీ మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి**

**వీపనగండ్ల,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వీపనగండ్ల మండల కేంద్రంలో ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలపై భారాలు వేస్తూ కార్పోరేట్లకు రాయితీలు ఇస్తున్నారని విమర్శించారు. అలాగే మతోన్మాదాన్ని పోషిస్తూ మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతూ అధికారంలోకి రావాలని బీజేపీ పార్టీ ప్రయత్నం చేస్తుందని కార్పోరేట్లకు కట్టబెట్టి ప్రభుత్వ రంగం కుదేలు చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ కల్పన జరిగే రంగాల్లో ప్రభుత్వం యువతకు ఉపాధి పెంచాలని, 5కేజీల ఉచితంగా ఇవ్వడంతో పాటు 5కేజీల సబ్సిడీ బియ్యం స్కీమ్ పునరుదనదరించాలని, ఉపాధి పథకానికి కేటాయింపులు పెంచి కూలి రేట్లు పెంచాలి కానీ కేంద్ర బడ్జెట్ లో ఉపాధి పథకానికి తూట్లు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ధనికులపై సంపద వారసత్వ పన్నును విధించాలి, వారికి ఇసునతన్న పన్నుల రాయితీలు ఉపసంహరించాలి అని అన్నారు. ఆహారం, మందులపై జీఎస్టీని రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ లను నెరవేర్చని యెడల ప్రజలను పెద్దఎత్తున కూడగట్టి దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల నాయకులు ఈశ్వర్, ఆశన్న, రామకృష్ణ, నవీన్, తిరుపతయ్య, రైతులు ఈశ్వరయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

# మైనార్టీల అభివృద్ధిని అడ్డుకుంటే గుణపాఠం చెబుతాం..

**పూటకో పార్టీ మారే వ్యక్తులు నీతులు చెప్పడం విడ్డూరం..**

**అమరచింత,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి అమరచింతలో మైనార్టీల అభివృద్ధి కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తుంటే స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు మైనార్టీలు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వారిపట్ల ముస్లింలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జుబేర్ అహ్మద్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు తౌఫిక్ మైనార్టీలను కోరారు. శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెనకబడిన మైనార్టీల అభివృద్ధి కోసం స్థానిక బీఆర్ఎస్ నాయకులు మజీద్ కమిటీ ఆదేశాల మేరకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని మైనార్టీల మధ్య విభేదాలు సృష్టించడానికి స్వార్థ రాజకీయాలు చేయడానికి పూనుకున్నారని అన్నారు. పూటకో పార్టీ మారే వ్యక్తులు మైనార్టీల అభివృద్ధి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని వారు ఎద్దేవ చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ బదులు మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం మైనార్టీలను మోసం చేయడమేనని మైనార్టీల అభివృద్ధిని అడ్డుకున్న వారిని ముస్లిం సోదరులు తగిన బుద్దిచెప్పాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అయూబ్‌ఖాన్, అస్సు అల్తాఫ్, ఖాసీం, మహ్మద్, రఫి, హబీబ్. సద్దాం తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం, గద్వాల నియోజకవర్గం గట్టు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని వివాహ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అంజి, శ్రీకాంత్, మాన్యం, ప్రసాద్ రామదు, నరేష్, బాలు, తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** గట్టు మండల పరిధిలోని బింగిదొడ్డి తండా గ్రామానికి చెందిన శిరీష్ తండ్రి కళ్యాణ్‌నాయక్‌కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నుండి మంజూరైన రూ. 1 లక్ష 25 వేల ఎల్ఓసి లెటర్‌ను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి విజయ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గద్వాల తిమ్మప్ప, మేస్త్రి తిమ్మప్ప, డీలర్ తిమ్మప్ప, నరేందర్‌నాయక్, ఆంజనేయులు, మహేష్ తదితులు పాల్గొన్నారు.

## వివాహవేడుకల్లో ప్రశాంత్‌రెడ్డి



**దేవరకద్ర,ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** దేవరకద్రలో శుక్రవారం మండలంలోని అడవిఅజిలాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి, సింధూజ రెడ్డిల వివాహవేడుకలకు దేవరకద్రకు చెందిన టీపీసీసీ ఆర్గనైజింగ్‌కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశిర్వదించారు. ఈ కార్యక్రమంలో కేపీఆర్ యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహవేడుకల్లో పాల్గొన్న యంపీపీ



**దేవరకద్ర,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం నాగారంలో శుక్రవారం జరిగిన పలు వివిహవేడుకల్లో యంపీపీ రమ్యాశ్రీకాం త్యాదవ్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులను ఆశిర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భరత్‌సింహారెడ్డి



**గట్టు,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వాయుల కుంట తండా, ఎల్లందొడ్డి, మాచర్ల, చాగదోణ గ్రామాలలో జరిగిన వివాహ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే భరత్ సింహారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.ఆయనతో పాటు మండల సీనియర్ నాయకుడు మధుసూదన్‌రావు,గట్టు మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, మన్నపురం శ్రీకాంత్‌రెడ్డి, గట్టు మండల యువమోర్చా అధ్యక్షుడు కొలాయి భాస్కర్, జి. నాగప్ప పాల్గొన్నారు.

# ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

## ●జూనియర్ సివిల్ జడ్జి పర్వీన్

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పర్వీన్ బేగం అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక కోర్టు భవనంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ రంగంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని ముఖ్యంగా అమ్మాయిలు చిన్న నిర్లక్ష్యం వల్ల మోసగాళ్ల చేతిలో మోసపోతున్నారని తెలిపారు. వీటినుండి కాపాడుకోవడానికి కోర్టు అథారిటీ ద్వారా లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలో మైనార్టీ బాలకలు సెల్‌ఫోన్ వల్ల అనేక వీడియోస్ చూసి చెడిపోతున్నారని, ఫోన్‌లో వచ్చే యూట్యూబ్ వీడియోస్ వల్ల యువత చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న సమాజంలో పక్కింట్లో ఏం జరిగినా మనకెందుకని ఆలోచిస్తున్నారని వాపోయారు.యువత నేర మార్గం నుండి దూరం ఉండాలని, నేరం చేసే ముందు వాటి పరిణామాలు, ఎలాంటి శిక్ష పడతుందనేది ఆలోచించుకోవాలన్నారు. మన సమాజంలో చట్టాలు



పాల్గొన్న న్యాయవాదులు, అధికారులు



పాల్గొన్న న్యాయవాదులు, అధికారులు

ఉన్నాయని వాటిని సరిగ్గతెలుసుకుని వినియోగించలేకపోతున్నారని అన్నారు. ఇలాంటి సదస్సులో పాల్గొని చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ప్రజలకు అర్థం అవుతుందని పేర్కొన్నారు. ఏదైనా అన్యాయం జరిగినప్పుడు వెంటనే వెళ్లి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలన్నారు. మైనర్ బాలికలు ఫోన్‌లు వాడటం తగ్గించాలని,ఈ విషయాన్ని తల్లిదండ్రులు, పిల్లలకు ఎలా ఉండాలనే విషయాలనుగురించి చెప్పాలన్నారు.చట్టం గురించి తెలిసిన వారెవరూ ఎలాంటి నేరాలు చేయరన్నారు. అందుకే చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిజి సతీష్‌గౌడ్, న్యాయవాదులు సలీం,మల్లికార్జున్, జి.హనుమంతు, సీతారాం,కుర్మన్న, నారాయణ, కె. నర్సింహులు పాల్గొన్నారు.

# దళితబంధు యూనిట్ల పరిశీలన



దళితబంధు యూనిట్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌లాల్

**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెట్టి అమలు చేస్తోందని ఎంపీడీఓ మోహన్‌లాల్ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని బర్కత్‌పల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో దళితబంధు అందుకున్న యూనిట్లను శుక్రవారం ఎంపీడీఓ మోహన్‌లాల్ పరిశీలించి ప్రభుత్వ ప్రవేశ పెట్టిన యాప్‌లో ఫోటోలను అప్‌లోడ్ చేశారు. అనంతరం చెర్కూర్, పోతేపల్లి గ్రామాల్లోని వన నర్సరీలను పరిశీలించారు. వేసవి కాలం సమీపిస్తున్నందున ప్రతి మొక్కను బ్రతికించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

# అమ్మవారికి క్షీరాభిషేకం

## - కొనసాగుతున్న అంబరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన గుండాల శ్రీ అంబ రామలింగేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి 108 కళషములతో వేదపండ తుల మంత్రోచ్చరణల మధ్య పాలాభిషేకాన్ని దేవాలయ చైర్మన్ గునగంటి మధుసూదన్‌రావుచే నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు గావించారు. అంబ పరమేశ్వరికి దేవీ అలంకరణ, ప్రత్యేక పూజలు, లలితా అష్టోత్తర, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించడంతో అమ్మవారు పార్వతి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి ఊత్సవమూర్తులను పల్లకిసేవ నిర్వహించారు. దేవాలయ చైర్మన్ గున గంటి మధుసూదన్‌రావును ఆలయ అర్చకులు శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో దేవాలయ ఈఓ ప్రసాద్, ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యాశర్మ, శివప్రసాద్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌శర్మ, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఎస్సీ కళాశాలను సందర్శించిన జనసేన నాయకులు

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జనసేన పార్టీ వనపర్తి కోఆర్డినేటర్ ముకుంద నాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని పీర్లగుట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ కళాశాల వసతి గృహాన్ని సందర్శించి వారి సమస్యలను అక్కడి పరిస్థితులను తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా నాయకులు పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ కళాశాల హాస్టల్ లో గురువారం భోజనంలో గాజుల పెంకులు రావడంతో విద్యార్థులు ఆందోళన గురిచెందారని అదే విధంగా నిరంతరం అన్నంలో పురుగులు రావడం నాసిరకంగా ఉండడం ఆ విషయాన్ని జనసేన పార్టీ నాయకత్వం తెలుసుకోని ఆ మేరకు వసతిగృహాన్ని సందర్శించి వార్డెన్ విద్యావతి తో మాట్లాడడం జరిగిందని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ హాస్టల్స్ లో ఉండే విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా వసతి కల్పించాల్సిన బాద్యత అక్కడి సిబ్బంది జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని ఎలాంటి ఇబ్బందులకు తావు ఇవ్వకుండా విద్యార్థులకు భోజన సౌకర్యం అందించాలని వారు అన్నారు. ప్రభుత్వ హాస్టల్స్ లో ఎక్కడైనా విద్యార్థుల సమస్యలు వినపడితే వెంటనే ప్రభుత్వ అధికారులు సందర్శించి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. అక్కడి హాస్టల్ వార్డెన్ స్పందిస్తూ వంట చేసే సమయంలో పొరపాటున అలా జరిగిందని ఆ అమ్మాయికి హాస్పిటల్‌లో కూడా చూయించామని ఎలాంటి సమస్య లేదని పేర్కొన్నారు. ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకుంటానని హాస్టల్ వార్డెన్ హామీ ఇచ్చారని తెలిపారు. గాజుపెంకు వచ్చిన అమ్మాయి ఆరోగ్య పరిస్థితిని కూడా కనుక్కోవడం జరిగిందని ఆమె ఎలాంటి సమస్య లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా జనసేన పార్టీ నాయకులు ఉత్తేజ్, సురేష్ యాదవ్, హేమవర్ధన్, నితిన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఎస్సీ కళాశాలను సందర్శించిన జనసేన నాయకులు

# అంతర్గత సీసీ రోడ్ల పనులు ప్రారంభం



అంతర్గత సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** అజిలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంతిరెడ్డిపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామంలో అంతర్గత సీసీ రోడ్డు పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ కాలే లక్ష్మమ్మ వెంకటేష్, ఉప సర్పంచ్ సులోచనమ్మతో కలిసి భూమి పూజ చేసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగాసర్పంచ్ కాలే లక్ష్మమ్మ వెంకటేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరు సహకరించాలని ఆమె పేర్కొన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదతామన్నారు.కార్యక్రమంలో గ్రామస్తులు కరుణాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, మల్లేష్, రవిగౌడ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్



కంటి వెలుగును ప్రారంభించిన సర్పంచ్

**మూసాపేట,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మూసాపేట మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ భాస్కర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

**పెద్దమందడి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** పది ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలను సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలకు సంబందించిన రికార్డులు పరిసర ప్రాంతాలతో పాటు ఉపాధ్యాయ విద్యార్థుల హాజరుశాతం భోజనవంటశాలలను పరిశీలించారు. అనంతరం 10వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు కల్పిస్తున్న బోధన, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన బోధన, మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఫలితాల పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపా ధ్యాయులు బాధ్యతగా విధి నిర్వహణ నిర్వర్తించాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థుల విద్యా సామర్థ్యాలు తెలుసుకుంటున్న డీఈఓ

# మూగ జీవాలకు నట్టల నివారణ మందులు వాడాలి



మూగజీవాలకు నట్టల నివారణ మాత్రలు వేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** గొర్రెలకు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వాడాలని పశువైద్యాధికారి శ్యాంసుందర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని పోతేపల్లి, అల్లంతోటబావితాండ, సిలోనిబావితాండాల్లో శుక్రవారం పశువైద్య ఆధ్వర్యంలో ఉచితంగా నట్టల నివారణ మందులను వేశారు. గ్రామాల్లో నిర్వహించే నట్టల నివారణ శిబిరాలను మూగజీవాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్యాంసుందర్ తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటమ్మ, కుమార్,మంగ్లీ, మైసయ్య,ఎంపీటీసీ చిట్టి కాదురాం, వైద్య సిబ్బంది నర్సింహ్మ,శ్రీనివాసులు,తిరుపతయ్య,మొగులయ్య, సాయిబాబు, బాలు, విజయేందర్,విశాల్,మహేందర్‌తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

# విద్యార్థులకు కళ్ళద్దాల పంపిణీ



విద్యార్థులకు కళ్ళద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**జడ్చర్ల,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** బాదేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 25 మంది విద్యార్థినీ, విద్యార్థులకు స్థానిక కౌన్సిలర్ రఘురాంగౌడ్ తన సొంత ఖర్చులతో పాఠశాలలోని విద్యార్థులందరికి కంటి వైద్యులచే పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అవసరమైన 24 మంది విద్యార్థులకు కళ్లద్దాలను స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌన్సిలర్ రఘురామ్ విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, మాజీ సంగీత నాటక అకాడమి చైర్మన్ శివకుమార్, కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ,అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

## తెలంగాణ ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్

**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకులాలు, ఉర్దూ మీడియం పాఠశాలలు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆల్ మేవా అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ సందర్శించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత 12 సంవత్సరాలుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి హితోధికంగా కృషి చేసిన కాటేపల్లి జనార్ధన్‌రెడ్డికి పిఆర్‌టియు మ్యాన్‌డేట్ ఇవ్వకుండా తీవ్ర అహంకారంతో పని చేసిన రాష్ట్రనాయకత్వానికి గుణపాఠం చెప్పే విధంగా ఉపాధ్యాయులు ఆత్మ ప్రభోధానుసారం ఓట్లువేసి కాటేపల్లి జనార్ధన్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారూఖ్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, అధ్యాపకుల ప్రధాన సమస్యలు ఇప్పటివరకు కాటేపల్లి కృషివల్ల పరిష్కరించబడినవి ప్రధానంగా ఉద్యోగ విరమణ, వయస్సు పెంపుదల, 30 శాతం ఫిట్‌మెంట్, పిఆర్‌సి అమలుకు ఆయన చేసిన కృషి ప్రధాన కారణమన్నారు. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్, కాటేపల్లి పేరు మీద ప్రొసీడింగ్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమంలో తెలంగాణ ఆల్‌మేవా గద్వాల జిల్లా అధ్యక్షుడు ముజీబూర్ రహమాన్, ప్రధాన కార్యదర్శి అస్లం షరీఫ్, ఉపాధ్యక్షులు అబ్దుల్ బషీర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

# మృతుని కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** లింగంపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయదారుడు చాంద్‌పాషా కుమారుడు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడైన తాహెర్‌పాషా చిన్న వయసులో అకాల మరణం పొందాడు. విషయం తెలుసుకున్న నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్షుడైన తాన్‌సింగ్ రాజ్ పురోహిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం ఈనెల 24న లింగంపల్లి గ్రామానికి వెళ్లి మరణించిన తాహెర్ పాషా కుటుంబాన్ని పరామర్శించి, వారికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత శివలింగప్ప, ఎంపిటిసి లతా సీతారామారావు, ఉప్పరపల్లి సర్పంచ్ డి. ఆంజనేయులు, గ్రామపెద్దలు రాజలింగప్ప, భీమేష్, రాము, స్వామి, మక్తల్ క్రీడాకారుడు జంగీర్ పాషా, షాబాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆర్థిక సాయం అందజేసిన తాన్‌సింగ్ రాజ్ పురోహిత్, బి. గోపాలములు చాంద్‌పాష కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు వారిని అభినందించారు.

# తిమ్మప్పస్వామికి వెండి చిమ్మెలు బహూకరణ



**మల్దకల్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణానికి చెందిన రంగస్వామి తండ్రి పెద్ద సిద్దన్న 500 గ్రాముల వెండి (సుమారు రూ.35 వేలు విలువ గల)చిమ్మెలను తిమ్మప్ప స్వామికి శుక్రవారం బహూకరించారు. దేవాలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యా చంద్రారెడ్డిల ఆధ్వర్యంలో అర్చకులు రవి, వాల్మీకి పూజారులకు అందజేయగా పూజలు నిర్వహించి దాతలను శాలువాతో సత్కరించారు.

# ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వనపర్తి జిల్లా విస్తృత సమావేశం గ్రామపంచాయితీ యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీఐటీయు వనపర్తి జిల్లా కార్యలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ప్రతి గ్రామ పంచాయితీ కార్మికుడికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని క్యాటగిరిగా వేతనాలు పెంచి స్పెషల్ స్టేటస్ కల్పించాలని పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రతి గ్రామ పంచాయితీ కార్మికుడికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని నెలనెల వేతనాలుచెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 12నుండి జనగామ జిల్లా పాలకుర్తి నుండి గ్రామపంచాయితీ కార్మికుల రాష్ట్ర పాద యాత్ర నిర్వహిస్తున్నారని ఈ పాదయాత్ర 28న ముగుస్తుందని ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లాలో ఉన్న గ్రామ పంచాయితీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ యూనియన్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ చారి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి హనీఫ్,జిల్లానాయకులు లక్ష్మయ్య, సాయికుమార్, ఖాదర్ పుల్లయ్య, నాగన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు జిల్లా నాయకులు

# రాజావలి దర్గా ఉర్సు ఉత్సవాల గోడపత్రిక విడుదల

**అమరచింత,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపాలిటీ కేంనరదంలోని మహిమాన్విత హజరత్ సయ్యద్ షా రాజావలి దర్గా 412వ ఉర్సు ఉత్సవాల గోడ పత్రికను శుక్రవారం నమాజ్ అనంతరం జామియా మసీద్ కమిటీ రాజావలి దర్గా కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీన వెండి దర్గాతో గ్రంధోత్సవం, 11వ తేదీన చాదర్ ఊరేగింపు, ఉర్సు హైదరాబాద్ వరిచే కవ్వలి కార్యక్రమం, 12వ తేదీన కత్మే ఖురాన ఫాతేహా, రాత్రి కవ్వాలి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. రాజావలి దర్గా ఉత్సవాలు ప్రతిసారి మాదిరిగా ఈ ఏ డాది కూడా వివిధ ప్రాంతాల నుంచి కులమ తాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలె హాజరవుతారమని వారు అన్నా రు. ఈ ఉత్సవాల ఏర్పాట్లను నేటి నుంచే ముమ్మరం చేసినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల్ ఇండియా కృష్ణ మహేష్ ప్రజాసేన రాష్ట్ర అధ్యక్షులు ఖాదర్ గోరితో పాటు ప్రముఖ సినీ నటులకు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, ఆత్మకూరు,అమరచింత మండలాల ప్రజా ప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ఉన్నతాధికారులకు అన్ని గ్రామాల వారికి ఆహ్వానాలు పంపి వారినిఉత్సవాల్లో పాల్గొనేలా ఉత్సవ కమీటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తుం దని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా అల్తాఫ్ బేగ్, ఆఫీస్ ఫరీద్, జామియా మసీద్, రాజవలి దర్గా కమిటీ సభ్యులు మైను,రఫీ,దుబాయ్ మైను,ఖాసీం,తోఫిక్, కుతుబ్,పాష, నయ్యర్, మోహిన్, తాచ,మన్నన్,ఖాదిర్. ఆశు,గాజుల మైను, మహ్మద్.రఫీ,అల్తాఫ్, అజ్జు, బషీర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు గౌస్, పంచాయితీ కార్య దర్శి రాజిక్ తదితరులు ఉన్నారు.



# పేరూరులో తహసీల్దార్‌కు ఘన సన్మానం



**దేవరకద్ర,ఫిబ్రవరి 24 ప్రభాత వార్త:** దేవరకద్ర ఉమ్మడి మండలంలోని కౌకుం ట్ల కొత్త మండల తహసిల్దార్ బ్రహ్మంను పేరూర్‌లో శుక్రవారం సన్మానించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పేరూర్‌కు వచ్చిన సందర్భంగా గ్రామానికి చెందిన జిల్లా సగర సంఘం ఉపాధ్యక్షుడు ఆర్‌సి శ్రీనివాసులు తహసిల్దార్‌కు ఈ సన్మానం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శివరాజ్, శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేయకూడదు

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** టీఎస్ఎస్‌పీడీసీఎల్ జేఏసీ పిలుపు మేరకు ఏప్రిల్ 2022 నుంచి ఇవ్వవలసిన వేతన సవరణ ఇంత వరకు ఇవ్వనందున అదే విధంగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ చేయకూడదని, టీపీసీ విద్యుత్తు వేతన సవరణ కమిటీకి సమర్పించిన డిమాండ్ లను అమలు చేయనందున విద్యుత్ అధికారులు, వనపర్తి జిల్లా విద్యుత్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి బాలనగర్ వనపర్తిలో సూపరిండెంట్ ఇంజనీర్ ఆఫీస్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ కి సంబందించిన వివిధ సంఘాల నాయకులు జిల్లాఎస్సీ పీవీ నాగేంద్ర కుమార్, డీఈ టెక్నికల్ వినాయక ప్రసాద్, ఏడీఈలు, ఎస్ఏఓ, ఎఎఓ, జెఎఓ, ఎస్ఎ, జెఎచ ఎఈ, సబ్ ఇంజనీర్స్, వనపరినత జిల్లా విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన విద్యుత్ అధికారులు

# మిషన్ భగీరథ నీళ్లు వృథా

**జడ్చర్ల,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలోని జాతీయ రహదారి జామ్ జామ్ హోటల్ ముందర సర్వీస్ రోడ్డులో ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైపు పగిలి నీరు జాతీయ రహదారి గుండావారం రోజులుగా ఏరులై పారుతున్నా పాలకులు, అధికారులు గాని పట్టించుకోవడం లేదని ప్రజలు విస్మ యం వ్యక్తం చేస్తున్నారు.



మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు వృథా అవుతున్న దృశ్యం

# ఉడిమిళ్ల గ్రామంలో ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధం



**పదర,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఉడిమిళ్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం అనుకోకుండా ఇంట్లో నుండి మంటలు రావడంతో పూడిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని మెగావత్ రవి కుటుంబ సభ్యులు ఎవరు లేని సమయంలో అనుకోకుండా ఇంట్లో మంటలు వచ్చి పూరగుడిసె దగ్ధం అయిందని తెలిపారు. గ్రామస్తులు అందరు ప్రమాద స్థలికి చేరుకుని ప్రమాదం మరింత జటిలం కాకుండా ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదం వలన కష్టం చేసి సంపాదించిన రూ. 1.50 లక్షలు, తిండిగింజలు, వస్త్రాలు, తన పిల్లలకు సంబంధించిన సర్టిఫికెట్లు అన్ని కాలి బూడిదయ్యాయని, ఈ ప్రమాదంలో ఒంటి బట్టలతో బయటపడ్డామని సుమారు రూ. 5 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పదర తహసిల్దార్ కృష్ణయ్య తన సిబ్బందితో ప్రమాద స్థలానికి వెళ్లి పంచనామా చేశారు.

## ఎల్‌ఓసి అందజేత


ఎల్‌ఓసి అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**జడ్చర్ల,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జడ్చర్ల మండల పరిధిలోని కిష్టంపల్లి గ్రామానికి చెందన వెంకటయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆసుపత్రి బిల్లుకు సంబంధించి రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్‌ఓసి చెక్కును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ కోడ్గల్ యాదయ్య, సర్పంచ్‌లు ప్రణీల్ చందర్, రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు జిల్లా నుంచి ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు ఎంపిక


శైలజ    శోభరాణి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ స్వావలంబన కొరకు శాస్త్రీయ, సాంస్కృతిని ప్రోత్సహించుట అనే అంశంపై జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ పత్రాలు ఆన్‌లైన్‌లో సమర్పించారని డీఈఓ గోవిందరాజులు పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు సైన్స్ ప్రాధాన్యత, దేశ పురోగతిలో సైన్స్ పాత్ర మొదలుగా అంశాలను సెమినార్ పత్రాల్లో వివరించారు. ముష్టిపల్లి, కోడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయురాలు శైలజ, శోభరాణిలు రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక కావడంపట్ల జిల్లా విద్యశాఖ అధికారి డి.గోవిందరాజు అభినందించారు. ఉపాధ్యాయులు ఫిబ్రవరి 28న రాష్ట్ర స్థాయి అధికారుల ముందు సెమినార్ పత్రాలను సమర్పిస్తారని డీఈఓ సూచించారు.

## యువకుడి మృతి

**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** గద్వాల మండలం కుర్వపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు పట్టుకోవడానికి వచ్చారన్న భయంతో పొలాల్లోకి పరుగెత్తిన యువకుడు గోపాల్ (28) గుండె పోటుతో చనిపోయాడు. గురువారం రాత్రి 12 గం.ల సమయంలో పోలీసులు దాడికి వచ్చారని ఆ సమయంలో భయంతో గోపాల్ పరుగెత్తడంతో దొడ్లల్లో అక్కడికక్కడే చనిపోయాడని, ఉదయం పనుల నిమిత్తం దొడ్లలోకి గ్రామస్తుడు వెళ్లగా అక్కడే పడి ఉన్న గోపాల్‌ను చూసి సమాచారం కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఈ దాడులు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేసినట్లు సమాచారం.

## నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు, స్వాధీనం చేసుకున్న డబ్బులు, బంగారం

**మక్తల్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మాగనూరు మండలం అమ్మపల్లి గ్రామంలో ఈనెల 22న కరువ మల్లమ్మ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లో ఉన్న డబ్బులు, బంగారు చెవి కమ్మలు దొంగతనం జరిగిన సంఘటనలో కేసును అతి త్వరలో చేదించిన మాగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం సాక్షుల విచారణలో కుర్వ నాగపుల్ల మహేష్ అమ్మపల్లిపై అనుమానం వ్యక్తం చేయగా ఆ వ్యక్తిని వడ్వాట్ గేట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారించగా తాను చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. అతని వద్ద నుండి రూ. 47,700లు, రెండు గ్రాముల చెవి కమ్మలు స్వాధీనం చేసుకునిఅరెస్టు చేసినారాయణపేట కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు.

## చిరువ్యాపారులకు చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఛైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి

**కల్వకుర్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** చిరు వ్యాపారాలు చేసుకొని లబ్ధి పొందాలనుకునే వారికి కల్వకుర్తి పీఏసీఎస్ బ్యాంక్ పరిధిలో రుణాలు అందిస్తున్నామని, రుణాలు తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో చెల్లించి పీఏసీఎస్ బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని ఛైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి పీఏసీఎస్ పరిధిలోని 8 మంది చిరు వ్యాపారులకు రూ.13.50లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామునాయక్,సిఈఓ వెంకట్‌రెడ్డి,కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## లక్ష్మి నరసింహస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

**పదర,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని పదర మండలం రాయలగండిలోని లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అచ్చంపేట నియోజకవర్గ ఇంఛార్జి డా. మోపతయ్య పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదర మండలంలోని రాయలగండి లక్ష్మి నరసింహ దేవస్థానం ప్రసిద్ధిగాంచిందని కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ ఉత్సవాలు జరపడం ప్రజలలో ఒక నూతన ఉత్సాహాన్ని నింపుతుందని వారు మాట్లాడారు. లక్ష్మి నరసింహ ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా జరుగుతుందని అన్నారు. శుక్రవారం రాయలగండిలో జరిగిన లక్ష్మినరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని ప్రత్యక్షంగా తిలకించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మన్ననూరు గ్రామంలో కానిస్టేబుల్ లక్ష్మణ్ తల్లి మరణించిన విషయం తెలుసుకున్న మోపతయ్య కార్యకర్తలతో కలసి వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని అందించడం జరిగిందని తెలిపారు.కార్యక్రమంలో కాశన్న, రాజయ్య, బరపటి బాబు,ఇస్మాయిల్,నిరంజన్, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మి నరసింహస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న టిడిపి నేత

# అంగరంగ వైభవంగా శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు
- భారీ బందోబస్తు మధ్య కల్యాణ వేడుకలు

**పదర, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఉమ్మడి అమ్రాబాద్ మండలం రాయలగండి వద్ద మాలల కుల దైవంగా ప్రసిద్ధి పొందుతున్న శ్రీశ్రీశ్రీ లక్ష్మి చెన్నకేశవ ఆలయం వద్ద కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనాధ నుండి మాలదాసరి పూజారుల చేత ఈ ఆలయం పూజలు అందుకుంటుంది.

**అంగరంగ వైభవంగా...** లక్ష్మి చెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా కనుల పండుగగా ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి అమ్రాబాద్, పదర మండలాలలోని ఆయా గ్రామాల మాల సామాజిక వర్గానికి చెందిన పెద్దలు సాంప్రదాయం ప్రకారం తలంబ్రాలను సమర్పించారు. భక్తుల సమక్షంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి లోక కళ్యాణం వైభవంగా నిర్వహించారు.

**ఆధ్యాత్మికత...** కళ్యాణ మహోత్సవం అనంతరం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఈ ఉత్సవాల సందర్భంగా మండలంలో కొంత మేరకు అనాలోచిత కారణంగానే చిన్నపాటి ఘర్షణ వాతావరణం నెలకొన్నదని అలాంటి వాటికి స్వస్తి పలుకుదామని భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం బద్ధంగా ఎవరి ఆత్మ గౌరవాలు దెబ్బతినకుండా వారి వారి సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు వెళ్దాం అన్నారు.

**చేతులెత్తి వినమ్రంగా...** ఈ ప్రాంత ప్రజలకు చేతులెత్తి మొక్కుతున్న అందరూ నా కుటుంబ సభ్యులేనని సీఎం కెసిఆర్ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం మరింత పెంపొందిస్తూనే సంస్కృతి, సాంప్రదాయాలకు అన్ని మతాల వారిని గౌరవిస్తున్న సందర్భంలో ఆధ్యాత్మికత వైపు ప్రజలను నడిపించేందుకు యాదాద్రి, కొండగట్టు ఆలయాల ప్రాధాన్యత అలాగే మన ప్రాంతంలో ఉన్న ఉమమహేశ్వరం, మల్లెల తీర్థం, మద్దిమడుగు అనేక దేవాలయాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిధులు కేటాయిస్తూ కృషి చేస్తున్నానని అదే క్రమంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయానికి గతంలో రూ. 50 లక్షలు మండప నిర్మాణం జరిగిందని, ఇటీవల ప్రకటించిన రూ. 75 లక్షల నిధులతో పూర్తి హంగులతో మండపం మరింత అభివృద్ధి జరుగుతుందని అవసరం మేరకు మరిన్ని నిధులు కేటాయిస్తానన్నారు.

**మాలలచే అధికారిక కమిటీ...** దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధన ప్రకారం లక్ష్మిచెన్నకేశవస్వామి అధికారిక ఆలయ కమిటి ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రత్యేకించి ఈ ఆలయానికి రెండు మండలాలకు చెందిన మాల సామాజిక నాయకులచే పూర్తిస్థాయి కమిటిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తూ ప్రతి వేదికను ఒకే కోణంలో చూడరాదని, ప్రస్తుతం ఈ వేడుకలకు ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనార్టీ క్రిస్టియన్ నాయకులు కూడాహాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. కంపు రాజకీయాలు వద్దని భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నచ్చినవారికి వేసుకుందామని,ఆ చెన్నకేశవుడి ఆశీస్సులతో వివాదాలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా కృషి చేసిన అధికారులకు, ఆలయ కమిటి సభ్యులందరికి, పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎవరు విమర్శలు చేసినవిమర్శగా ఉండాలనిఆత్మపరిశీలన జరిగేలావిమర్శలు ఉంటే తప్పకుండా మార్చుకునే ప్రయత్నం చేస్తానన్నారు.


లక్ష్మి చెన్నకేశవస్వామి వారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

**త్వరలో ఆ ప్రాజెక్టులకు...** చాలాకాలంగా వేచి చూస్తున్నా అచ్చంపేట నియోజకవర్గం ప్రజలకు సాగునీటి విషయాన్ని సహకారం చేసేందుకు ఉమామహేశ్వర, శ్రీలక్ష్మి చెన్నకేశవ ప్రాజెక్టుల కోసం త్వరలోనే ముఖ్యమంత్రి కెసిఆర్ ద్వారా శంకుస్థాపన చేసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నానని తద్వారా కృష్ణమ్మ నీటితో ఈ ప్రాంత బీడు భూములకు ఈ ప్రాంత ప్రజల పాదాలు ఆ నీటితో తాకడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ అధికారి వెంకటేశ్వరమ్మ, తహసిల్దార్ కృష్ణయ్య, ఛైర్మన్ నిరంజన్ దంపతులు, జడ్పీటిసి రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, జిల్లా నాయకులు చెన్నకేశవులు, అనిల్, మండల పార్టీ అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీరాంనాయక్, శారదా శ్రీనివాసులు, పెద్దిరాజు, అచ్చంపేట మున్సిపల్ ఛైర్మన్ నరసింహగౌడ్, వైస్ ఛైర్మన్ శైలజా రెడ్డి, మాజీ ఎంపిపి పర్వతాలు,ముత్యాలు,మల్లేష్, మద్దిమడుగు పాలకమండలి ఛైర్మన్ విష్ణుమూర్తి, డైరెక్టర్లు నిమ్మల శ్రీనివాసులు, పంబలి మల్లేష్,ఎండి అజ్మత్ పాషా, సర్దార్ నాయక్, మహేందర్‌గౌడ్, తిరుపతయ్య, రాజారాంగౌడ్, వివిధ గ్రామాల భక్తులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల కళాశాల భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** జిల్లాలో ప్రభుత్వ బాలికల కళాశాల భవన నిర్మాణ పనులను మార్చి 15 వరకు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్మీడియట్ కోఆర్డినేటర్,ఇడబ్ల్యుఐడిసి, ఇరిగేషన్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1.50 లక్షలతో చేపట్టిన ప్రభుత్వ బాలికల కళాశాల నిర్మాణ పనులను మార్చి 15వరకు పూరిచేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని అన్నారు.ప్లాస్టింగ్, పెయింటింగ్, ఎలక్ట్రిసిటి పనులన్నిపూర్తి చేయాలని అన్నారు. రెండు పడకల గదుల నిర్మాణ పనులకు సంబంధించి మాట్లాడుతూ టెండర్ పూర్తి వాటికి నిర్మాణ పనులు ఎప్పటిక వరకు పూర్తి చేస్తారని అడిగి తెలుసుకున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఆర్టీసి బస్టాండ్‌లో ఫ్లోరింగ్, ప్లాస్టింగ్, ఫినిషింగ్ నిర్మాణ పనులు ఉన్నాయని ఏప్రిల్ వరకు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలపగా ఎక్కువ మంది టీంలను పెట్టి మార్చి21 వరకు పూర్తి అయ్యే విధంగా చూడాలన్నారు. జూరల ప్రాజెక్టు దగ్గరలో నిర్మాణం చేస్తున్న టూరిజం పార్కు మ్యాప్‌ను పరిశీలించి మాట్లాడుతూ 15 కోట్లతో 72 ఎకరాలలో టూరిజం పార్కు అభి.వృద్ధి పనులు వేగంగా జరగాలని టూరిజం అధికారులను ఆదేశించారు. గ్రీనరీ, పెద్ద మొక్కలు నాటేందుకు ప్లాన్ చేయాలని తెలిపారు. సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు,ఇంటర్ మీడియట్ కో ఆర్డినేటర్ హృదయరాజు, టూరిజం డిఇహనుమంతురెడ్డి, ఆర్టీసి మేనేజర్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల పనుల్లో వేగం పెంచాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా మున్సిపాలిటి పరిధిలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలు కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఎంఏవై, కంటి వెలుగు, పోడు పట్టాలు,అయిల్ ఫామ్ సాగు, యాసంగి, వరికొనుగోలు, తెలంగాణకు హరితహరంపై జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి అవాస్ యోజన క్రింద నిర్మించబడిన డబుల్ బెడ్ రూం ఇండ్లకు లబ్ధిదారులను గుర్తించి కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగుతోందని, అన్ని జిల్లాలో బాగా జరుగుతున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రెస్క్రిప్షన్ కంటి అద్దాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విధంగా తయారు చేసి ఆయా జిల్లాలకు పంపించడం జరుగుతున్నాయని, ఎవరి అద్దాలు వాళ్లకే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ బృందాలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ మౌళిక సదుపాయాల విషయంలో రాజీపడకుండా చూసుకోవాలన్నారు. పోడు పట్టాల జారీ విషయంలో మాట్లాడుతూ అర్హులైన వారి పట్టా పాసు పుస్తకం కొరకు అన్ని పరిశీలన ప్రక్రియ పూఇర్త చేసి పాస్ పుస్తకాల ముద్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి ప్రభుత్వం ఎప్పుడు చెప్పిన వితరణ చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వచ్చే హరితహరంలో ఏ గ్రామ పంచాయతీకి సంబంధించి ఆ గ్రామ పంచాయతీ నర్సరీల నుంచి మొక్కలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లాకు ఇప్పటి వరకు వచ్చిన ప్రెస్క్రిప్షన్ కంటి అద్దాలు ఆధర్ నెంబరు ఆధారంగా ఎవరి అద్దాలు వారికే అందిస్తామన్నారు. జీవో 58, 59 ద్వారా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న అర్హులకు పట్టా సర్టిఫికెట్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన డబుల్ బెడ్‌రూం ఇండ్ల ఎంపిక, నమోదు కార్యక్రమం, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అమలు చేయడం లేదని ఎన్నికల కోడ్ పూర్తి కాగానే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఫాం అయిల్ సాగులో నాగర్‌కర్నూల్ జిల్లాకు రూ.3వేల ఎకరాల్లో సాగు చేసేందుకు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2511 ఎకరాల్లో సాగు చేయడం జరుగుతుందని, మిగిలిన 489 ఎకరాలు నిర్ణీత సమయంలోగా లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మనుచౌదరి,అదనపు కలెక్టర్ రెవెన్యూ మోతిలాల్, డీఎఫ్ఓ రోహిత్‌గోపిడి, సంబంధిత జిల్లా అధికారులు ఉన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇస్తున్న శాంతకుమారి, పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

# స్త్రీ నిధి మొండి బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు

- డీఆర్‌డీఓ నర్సింగరావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** స్త్రీ నిధి మొండి బకాయిల వసూళ్లపై నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖ పరంగా చర్యలు ఉంటాయని, వచ్చే నెల 10వ తేదీ లోపు స్త్రీ నిధి ఎన్పీఎ తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, వాటి వివరాలను డీఆర్‌డీఎ కార్యాలయం నందు సమర్పించాలని డీఆర్‌డీఓ నర్సింగరావు క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ప్రజావాణి సమావేశ మందిరంలో కల్వకుర్తి క్లస్టర్ స్థాయిలో అధిక బకాయిలు కలిగిన గ్రామ సంఘాల సిబ్బందికి సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి మహిళల బ్యాంకు అని, మహిళా సంఘాల సభ్యులు అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని ఇబ్బందులకు గురి కాకూడదనే ఉద్దేశ్యంతో స్త్రీ నిధిని ఏర్పాటు చేయడం జరిగిందని, కొందరు సిబ్బందిని నిర్లక్ష్యం కారణంగా లక్ష్యానికి ఆటంకం ఏర్పడుతుందని, ఇలాంటి వారి విషయంలో కఠినంగా ఉంటామన్నారు. ఇక నుంచి గ్రామ సంఘాల్లో స్త్రీ నిధి బకాయిలు ఉన్న సంఘాలకు బ్యాంక్ లింకేజీ, ఇతర రుణ పథకాలను నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ స్థాయిల్లో పూర్తి అవగాహన కల్పించే బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బందిదేనని అన్నారు. పీఎం ఎఫ్ఎం ఈ పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యులచే ఏర్పాటు చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల గ్రౌండింగ్‌ను వేగవంతం చేయాలని సూచించారు.


సమావేశానికి హాజరైన క్లస్టర్ సిబ్బంది

# 18 సంవత్సరాల్లోపు పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మక్తల్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** 18 సంవత్సరాల్లోపు పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆర్‌బిఎస్‌కె (రష్టియ బాల్ స్వాస్త్య కార్యక్రమం) వైద్య బృందంతో విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశంలో 6 నుండి 18 సంవత్సరాలలోపు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 5 టీమ్‌లు ఉన్నాయని వైద్యులు కలెక్టర్‌కు పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వైద్య బృందం ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థినిని పరీక్షించాలని ఉదయం 9.30 గం.ల కల్లా చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే అంగన్‌వాడి కేంద్రాలలో ఉన్న చిన్న పిల్లలకు కూడా పరీక్షించాలని వారికి అవసరమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. చిన్న పిల్లల పుట్టుకతో లోపాలు, రక్తహీనత కలిగిన వ్యాధుల లోపాలు ఉన్న వారిని మెరుగైన వైద్యానికి జిల్లా ఆసుపత్రికి పంపించాలని సూచించారు. వారానికి ఒక్కరోజు రెఫరల్ డే ఉంటుంది. ఆరోజు వారికి సంబంధిత వైద్యునికి చూపించిమెరుగైన వైద్యం అందించాలన్నారు.ఈసమావేశంలో డిఎంహెచ్ఓ డా. రామ్ మనోహర్‌రావు, డా. శైలజ, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## 26న సీపీఎం ప్లీనరీ సమావేశం

**వనపర్తి టౌన్,ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా సీపీఎం కార్యాలయం లో పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశం ఈనెల 26న నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ జాన్ వెస్లీ, సాగర్ లు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తీసు కొస్తున్న, చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు నిరుద్యోగం, పేద రికం, ప్రజా జీవితాలపై మోపుతున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా చేపట్ట బోయే కార్యక్రమాలపై జిల్లా వ్యాప్త కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.ఈసమావేశానికి జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## చిన్నారులకు చదువుపై ఆసక్తి కలిగించాలి

- కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్

**లింగాల,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** చిన్నారులు చదువుపై , క్రీడలపై ఆసక్తి కలిగించేందుకు క్రీడా సామాగ్రి పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రపెంట,చెన్నంపల్లి గ్రామాలలో ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్ మాట్లాడుతూ పేదరికంలో చిన్నారులు చదువుకు దూరం కాకూడదనే ఆలోచనతో చదువుపై కల్గించడానికి క్రీడా సామాగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నారులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రాథోడ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు